క్లుప్తంగా

నేడు ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ

పర్చూరు: నియోజకవర్గ కేంద్రం పర్చూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో 28వ తేదీ శనివారం సాయంత్రం 3 గంటలకు దిశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దిశా ఫౌండేషన్, హిస్టరీ అకాడమీ డైరెక్టరు జక్కిరెడ్డి సుబ్బాయమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, ఎమ్మెల్సీ పోతుల సునీత, రాష్ట్ర టైలరింగ్ చైర్మన్ షేక్ సుభాన్‌బీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కావున నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డీజిల్ సరఫరాకు టెండర్ల ఆహ్వానం

అద్దంకి రూరల్: ఏపీఎస్‌ఆర్టీసీ బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి, బాపట్ల, చీరాల, రేపల్లె డిపోలకు డీజిల్ సరఫరా చేసేందుకు ప్రైవేటు డీజిల్ బంకుల డీలర్ల నుంచి టెండర్లు ఆహ్వానించనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ ఫారాలు ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు జిల్లా ప్రజా రవాణా అధికారి బాపట్ల కార్యాలయంలో లభిస్తాయన్నారు. పూర్తి చేసిన ఫారాలను ఫిబ్రవరి 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన షీల్డ్ బాక్స్‌లో వేయాలని తెలిపారు. అదే రోజు 3 గంటలకు టెండర్‌లు ఓపెన్ చేసి ఎక్కువ డిస్కౌంట్ ఆఫర్ చేసిన వారికి అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటింటా వైద్యం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మార్చి 1 నుంచి ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ఇంటింటికి వైద్యం అందించబోతుందని 104 వైద్యాధికారి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సూరేపల్లి, గంగపాలెం గ్రామాల్లో 104 శిబిరంలో భాగంగా 69 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చలి, మంచుతో అస్వస్థతకు గురికాకుండా ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి కోరారు. శిబిరంలో విష్ణు, డేవిడ్, నందిని విజయదుర్గా, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల అర్బన్: రేపల్లెలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఇనగంటి రాహుల్ బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. హెచ్‌ఎం బి.సాల్మన్‌రాజు మాట్లాడుతూ క్రీడలతో పాటు చదువులో కూడా చక్కగా రాణించాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.రమణారావు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, గాంధీ, పి.భానుచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్ర దానం



టీ వెంకటేశ్వర్లు (ఫైల్)

చినగంజాం: ఇంకొల్లులో శుక్రవారం మరణించిన తూమాటి వెంకటేశ్వర్లు (74) నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు కవిత, లలిత, ప్రసాద్, రాములు దానం చేశారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకరకంటి వైద్యశాల వైద్యులు డాక్టర్ రియా, రుతుజ, మేఘనలు దాత కార్నియాలను సేకరించారు. రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహనరావు,అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్ భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణలు కుటుంబ సభ్యులను అభినందించారు.

ఉచిత క్యాన్సర్ శిబిరానికి స్పందన

చీరాల రూరల్: ఒంగోలు ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం చీరాల ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు అంకాలజిస్ట్ కొల్లూరు సాయికృష్ణ హాజరైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు అందజేశారు. వ్యాధి లక్షణాలు ఉన్నాయని గ్రహించిన రోగులు వెంటనే తమ ఆస్పత్రికి వచ్చినట్లయితే చికిత్స అందించి వ్యాధిని పూర్తిగా నయం చేస్తామని ఆయన చెప్పారు. ప్రతినెల చివరి శుక్రవారం రోజున చీరాలలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సీహెచ్. శరత్‌బాబు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శనగ సాగుతో సిరుల పంట

- ఈ ఏడాది ఆశాజనకంగా మారిన శనగ
- రబీలో పెరిగిన సాగు విస్తీర్ణం
- ధరలపైన రైతన్నల ఆశలు



తెగుళ్లు సోకకుండా మందు పిచికారీ చేస్తున్న రైతు

కారంచేడు: గత మూడేళ్లుగా ప్రకృతి కరుణించడంతో వరుణ దేవుడు రైతు పక్షాన నిలిచాడు. ఫలితంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు భారీగా పంట ఉత్పత్తులు సాధించారు. రబీ సీజన్ కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఏడాదిలో అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ప్రాంతంలో సాగు చేసే వరి, మిరప, శనగ, పొగాకు చేలు కళకళలాడుతున్నాయి. అందుకు అన్ని విధాలుగా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. దీంతో అన్నదాతలు ఉత్సాహంగా వివిధ రకాల పంటలు సాగు చేశారు. వీటిలో శనగ సాగు రైతుకు సిరుల పంటగా మారనుందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ధరలు, దిగుబడులపై పెంచుకున్న ఆశ..

ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు శనగ సాగుకు బాగున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శనగ సాగులో ఈఏడాది జేజే-11 రకం సాగులో ఎకరానికి సుమారు 10-12 బస్తాలు, కాక్-2 రకం సాగులో ఎకరానికి 8-10 బస్తాల దిగుబడులు వస్తాయనే ఆశలో అన్నదాతలు ఉన్నారు. పంట నిగారింపుతో కళకళలాడుతున్న తీరుతో వాతావరణం అనుకూలిస్తే దేవుని దయతో పంటలు వస్తాయని ఆశిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ ధర ప్రకారం క్వింటా ధర రూ.5280 ఉంది. అయితే మార్కెట్ ధరలు మాత్రం రూ.4400 నుంచి రూ.4600 వరకు దళారులు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నారు. దిగుబడులు ఎకరానికి 10-12 బస్తాలు వచ్చి ధరలు కింటాకు రూ.7000 వరకు ఉంటే శనగ రైతుల ఇంటి సిరుల పంట కురుస్తుందని, అందుకు ప్రభుత్వం కూడా మద్దతు ధరలు పెంచేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

పర్చూరు నియోజకవర్గంలో శనగ సాగు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
పర్చూరు	20350 సుమారుగా..
కారంచేడు	3750
ఇంకొల్లు	4275
చినగంజాం	4172
యద్దనపూడి	5562
మార్టూరు	2275

అక్కడక్కడ కుంకుమ తెగులు..

నియోజకవర్గంలోని పైమండలాల పరిధిలో సాగు చేసిన శనగ చేలల్లో అక్కడక్కడ కుంకుమ తెగులుతో పాటు, ఎండు తెగులు కనిపిస్తుండటంతో రైతులు కొంత ఆందోళన చెందుతున్నారు. అయితే వీటిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు మాత్రం తెగుళ్ల గురించి ఆందోళన చెందాల్సిన పని లేదని, తగు జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్లను నివారించుకోవచ్చని చెప్తున్నారు.

శనగ సాగు ఆశాజనకంగా ఉంది..

ఈ ఏడాది ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఇంత వరకు శనగ సాగు ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలంగా ఉండటంతో చేలు కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో శనగ సాగు పూత, పిందె దశల్లో ఉంది. ఇదే వాతావరణ పరిస్థితులు ఉంటే మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నాం.

– వై. శ్రీనివాసరావు, రైతు, కారంచేడు

మంచి గిట్టుబాటు ధరలపైనే ఆశలు..

శనగసాగు ఈ ఏడాది ఎక్కువగానే ఉంది. మంచి దిగుబడులు వస్తాయనే ఆశ కూడా ఉంది. అయితే గతంతో పోల్చుకుంటే ఈ ప్రభుత్వంలో శనగ రైతులకు మంచి గిట్టుబాటు ధరలున్నాయి. ఈ ఏడాది వచ్చే దిగుబడులతో రైతులు మేలు పొందాలంటే కింటాకు రూ.7000 మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

– డీ. రామకృష్ణ, రైతు, ఆదిపూడి

తెగుళ్లతో భయపడాల్సిన పనిలేదు..

ఈ ప్రాంతంలో శగన సాగులో ఉన్న కుంకుమ తెగులు, ఎండు తెగులుతో ఎక్కువగా భయపడాల్సిన పనిలేదు. వీటి నివారణకు హెక్సాకొనజోల్‌ను ఒక లీటర్‌ను సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో పిచికారీ చేసుకోవాలి, ట్రైకోడెర్మావిరిడై ఒక కేజీని ఎకరా చేనులో పిచికారీ చేసుకుంటే ఫలితం ఉంటుంది.

– కే శివనాగప్రసాద్, వ్యవసాయాధికారి, కారంచేడు

సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్

చినగంజాం: అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తానని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. ఇంకొల్లులో రెండో రోజు పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఆటోనగర్, కృష్ణానగర్, పలు వార్డుల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా బస్టాండ్ ఆవరణలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం నందు, కృష్ణానగర్ కృష్ణుని ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. ఆటోనగర్ యూనియన్ సభ్యులతో సమావేశమై ఆటో నగర్ సమస్యలను సభ్యులతో చర్చించారు. డ్రైనేజీ, రోడ్లు, కల్వర్టులను పరిశీలించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని, చెరువు ఫెన్సింగ్, ఫిల్టర్ బెడ్స్‌ను రిపేరు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కృష్ణనగర్‌లో డాక్టర్ కొడాలి ధర్మానందరావును పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండారు అనూష రాజ్‌కుమార్, సర్పంచ్ యేజర్ల ప్రసన్న సైమన్‌బాబు, మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, వైస్ ఎంపీపీ తూమాటి చలమయ్య, ఆయేషాబుడే, బండ్ల వెంకట సుబ్బారావు, నీరుకట్టు వాసుబాబు, ఆర్ ధనుంజయరాజు, అడపా సుదాకర్, జువ్వా శివరాం, ఉప సర్పంచ్ లతీఫ్, డాక్టర్ ఉస్మాన్, షంషిద్దీన్, కృష్ణుడు, ఆలపాటి నాని, మొలక శ్రీనివాసరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సుభాని, పాటిబండ్ల గోపాల స్వామి, పులఖండ రామకృష్ణారెడ్డి, పాదిలి రాఘవ, బిల్లాలి డేవిడ్, మస్తాన్‌వలి, గుది ఆదెయ్య, చల్లపల్లి గోపి, చుండి మురళి, ఎంపీటీసీ ఇబ్రహీం, ట్రెజరర్ సుభాని, బుడే, ప్రసాద్, మోపిదేవి లక్ష్మణరావు, బర్కత్‌వలి, సైదా, బాజీ, సుభాని, మెకానిక్ శ్రీను, కోటి, కాజా, ఖాదర్ బాష, ఆలీం తదితరులు పాల్గొన్నారు.

బడుగు వికాసంలో సబ్సిడీపై కార్లు



సబ్సిడీపై కారు అందజేస్తున్న ఏపీఎం, మేనేజర్

బల్లికురవ: ప్రభుత్వం బడుగు వికాశంలో 45 శాతం సబ్సిడీపై కార్లు, ఆటోలు, టాటాఏస్ వాహనాలు అందజేస్తోందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం బాచిన సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. మండలానికి 25 యూనిట్లు మంజూరు కాగా 20 సచివాలయాల్లో 52 మంది ఎస్టీ, ఎస్సీలు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ బ్యాంకు లావాదేవిలు సక్రమంగా ఉన్నవారిని గుర్తించి తొలి విడతలో బల్లికురవ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి రెండు కార్లు అందజేసినట్లు వివరించారు. నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన బండి రవికుమార్, రామాంజనేయపురం గ్రామానికి చెందిన జంగ్రాజుపల్లి ప్రసాద్‌కు రూ.9 లక్షలతో కార్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బల్లికురవ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎస్ విష్ణు నాయక్, సీసీ ప్రమీల, ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బ్యాడ్మింటన్ పోటీలు



బహుమతులు అందుకుంటున్న విజేతలు

చీరాల అర్బన్: పట్టణంలోని డీఎస్‌ఏ రోటరీ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. కిరణ్‌కుమార్, షాహిద్ ఆధ్వర్యంలో చీరాల నియోజకవర్గస్థాయి, ఇన్విటేషన్ టీమ్స్‌లతో నాన్ మెడలిస్ట్ మెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీకి 32 టీమ్‌లు పాల్గొనగా మొదటి బహుమతిని చిలకలూరిపేటకు చెందిన ఖాదర్ మస్తాన్, హర్ష, రెండో బహుమతిని చీరాలకు చెందిన హేమంత్, ఆకాష్‌లు, మూడో బహుమతిని చీరాల క్రీడాకారులు కోటా తేజరాజ్, షారికలు, నాలుగో బహుమతిని మార్టూరు క్రీడాకారులు బాజి, నజీర్‌లు గెలుపొందారు. క్రీడల ద్వారా యువకుల్లో క్రీడా నైపుణ్యం పెంచడం, ఆరోగ్య రక్షణకు ఇటువంటి టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు కిరణ్ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు కబీర్, కిరణ్; రిషి, రిఫరీ గాస్పర్, అజాద్, కృష్ణారెడ్డి, దంత వైద్యులు బ్లెసీ అబ్రహం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం అభినందనీయం



నగదు అందజేస్తున్న ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

చినగంజాం: పాఠశాలలో చదువుకొని వివిధ రకాల వృత్తుల్లో స్థిరపడి పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకోవడం అభినందనీయం అని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం దేవదత్తం అన్నారు. పెదగంజాం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 40 మంది ఎంప్లాయిస్ అసోసియేషన్‌గా ఏర్పడి పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం దేవదత్తం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సీఐఎస్‌ఎఫ్, సీఆర్పీఎఫ్, ఆర్మీ, ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లు, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడి సంఘంగా ఏర్పాటై పాఠశాలలో 2018, 2019 టెన్త్ విద్యార్థులకు నగదు బహుమతులు అందించారని చెప్పారు.

మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతి పంపిణీ...

పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2021-22 పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు పెదగంజాం ఎంప్లాయిస్ అసోసియేషన్ నగదు బహుమతులు అందజేశారు. పాఠశాలలో 500 మార్కులుపై సాధించిన వైమహేష్ రూ.5 వేలు, కే అజయ్‌కుమార్ రెడ్డి రూ. 4500, ఆర్ మణికుమార్ రూ.3 వేలు, కే అవినాష్ రూ.2500 అందజేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కుక్కల అంకిరెడ్డి,కుక్కల వెంకటేశ్వర్లు రెడ్డి, పిట్టు వెంకటరెడ్డి, ఆసోది తిరుపతి అంకిరెడ్డి, మరుప్రోలు రవీంద్రారెడ్డి, ఆసోది యల్లారెడ్డి, ఆసోది మౌలాలి రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ వీ ఉదయ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలతో ప్రమాదాలకు చెక్



మాట్లాడుతున్న ఏఎస్సై

అద్దంకి: భద్రతా నియమాలతో ప్రమాదాలకు చెక్‌పెట్టొచ్చని ఏఎస్సై ఏడుకొండలు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రారంభోత్సవ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో డిపో మేనేజర్ రామమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ రోడ్డుపై ఏర్పాటు చేసిన గుర్తులను తెలుసుకుని, ఆయా ప్రదేశాల్లో డ్రైవింగ్ చేయాలని చెప్పారు. పాఠశాలల వద్ద, దేవస్థానాల వద్ద, క్రాసింగ్, మలుపుల వద్ద పెట్టిన సూచిక బోర్డులు డ్రైవర్‌కు ఆయా ప్రాంతాల్లో ఏముందనే విషయాన్ని తెలియజేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రయాణికుల సంఘ నాయకుడు మన్నం త్రిమూర్తులు, ఫైర్‌స్టేషన్ ఏఎస్సై మాల్యాద్రి, డిపో సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

పథకాలతో ఆక్వా రైతులకు మేలు



రైతులతో మాట్లాడుతున్న ఫిషరీస్ అధికారులు

చినగంజాం: ఆక్వారైతులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని చీరాల మత్స్యశాఖ ఏడీ కృష్ణకిషోర్ అన్నారు. గురువారం మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆక్వా కల్చర్ రీ సర్వే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా జోన్‌లో ఆక్వారైతులు అందరూ భాగస్వామ్యులు కావాలని, ఆక్వా భూముల సర్వే నంబర్‌లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం పది ఎకరాలలోపు ఆక్వా సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ఇస్తుందన్నారు. రైతులు వారి భూముల వివరాలను ఫిషరీస్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆక్వా రైతులు మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం అందించే ఫీడ్ సరఫరా, వాటర్ అనాలసిస్, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మత్స్యశాఖ అందిస్తున్న మిని ఫిష్ వెండింగ్ షాప్‌లు, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా అందిస్తున్న బయోఫ్లాక్, టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్‌ల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ రాజ్‌కుమార్, సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి శైలజ, వీఆర్వో డానియేల్, ఫిషరీస్ అసిస్టెంట్ ప్రమీల, పంచాయతీ సిబ్బంది, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

ఘనంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

చీరాల: స్థానిక కొత్తపేటలోని ఓంకార క్షేత్రంలో శుక్రవారం ఆలయ రాజగోపురం, కాలభైరవ, చండీశ్వర, దక్షిణామూర్తి, రాహు కేతువులు, బలిపీఠం ప్రతిష్ట సహిత మహా కుంభాభిషేక మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యంత్రస్థాపన, విమాన శిఖర, విగ్రహ ప్రతిష్టలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి, అలంకరణలు చేశారు. అలానే శివపార్వతులు, సీతారాముల శాంతి కళ్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో అచ్చుతుని రాజేష్ దంపతులు, గుంటూరు వెంకటరమణ, అల్లంశెట్టి తిరుమల శ్రీనివాసరావు, తాడివలస దేవరాజు దంపతులు, నర్ర శ్రీను, కె.రవీంద్రబాబు, దేవస్థాన అధ్యక్షులు టి.సత్యనారాయణ, ఉప్పుగుండూరు రామకృష్ణ శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

మండప నిర్మాణానికి దాతల సహకారం



భూమి పూజ చేస్తున్న అనిల్‌కుమార్ దంపతులు

పర్చూరు: పర్చూరు-గుంటూరు ఆర్ అండ్ బీ రోడ్డులోని వై జంక్షన్ వద్ద నూతనంగా నిర్మాణం చేపడుతున్న 95 అడుగుల అభయాంజనేయ స్వామి వారి విగ్రహం వద్ద మండప నిర్మాణానికి దాత ఆలా ధనలక్ష్మీ, కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారం అందజేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు కోట హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండప నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని ఆలా అనిల్‌కుమార్ దంపతులచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో బాలాజీ, తులసీ భువనేశ్వరరావు, తులసీ భాస్కర్, మాజీ ఎంపీపీ కొల్లా వెంకటరావు, కమిటీ సభ్యులు విన్నకోట రవి, కఠారి సురేంద్ర, రంగిశెట్టి ఆంజనేయులు, తులసీ శివనాగేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, గాజుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రికవరీలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం అంజిబాబు

చినగంజాం: గ్రామ సంఘాల లీడర్లు స్వయం సహాయక సంఘాల బ్యాంక్ రుణాల రికవరీలను వేగవంతం చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం బీ అంజిబాబు అన్నారు. గురువారం మండల సమాఖ్య సమావేశం వైఎస్సార్ క్రాంతి పథం సమావేశ మందిరంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కే లుధియమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఏపీఎం మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గురించి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు శ్రీనివాసరావు, చిన్నారావు, అన్ని గ్రామాలకు చెందిన గ్రామ సంఘాల వీఓఏలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బేకరిలో అగ్ని ప్రమాదం

చీరాల అర్బన్: విద్యుదాఘాతంతో ఓ బేకరిలో అగ్నిప్రమాదం జరిగింది. పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లోని స్వీట్ డ్రీమ్స్ బేకరీకి సంబంధించిన తయారీ కేంద్రంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బేకరీకి సంబంధించిన ముడిసరుకులు, సామగ్రి, మైక్రోఓవెన్‌లు, సీసీ కెమెరాలు కాలిపోయాయి. పొగ రావడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఈ మేరకు బేకరీ యజమాని నుంచి వివరాలు నమోదు చేశారు.

కొణిదెనలో సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణం

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామ సమీపంలోని బ్రహ్మకుండం వద్ద వేంచేసిఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి మూడో శాంతి కళ్యాణం ఈ నెల 31న ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు అంకురార్పణ, గణపతి పూజ, పుణ్యాహవచన, పంచగవ్య ప్రాసన, ఋత్విగ్వరణ, మండపారాధనతో వేడుకలు ప్రారంభమౌతాయని చెప్పారు. సాయంత్రం నూతన నందీశ్వరునికి జలాధి, క్షీరాధివాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి, నవగ్రహ, దక్షిణామూర్తి, దుర్గాదేవి, వాస్తు రుద్రహోమాలు రాత్రికి కోలాటం ఫిబ్రవరి 1 ఉదయం 8.25 కు నంది ప్రతిష్ట, స్వామివార్ల శాంతి కల్యాణం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రుగ్వేద పండితులు టి. సత్యనారాయణశర్మ బృందంచే జరిగే వేడుకలకు గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశం

చీరాల అర్బన్: చీరాల ఆర్టీసీ డిపో పరిధిలోని చీరాల, పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, బస్‌స్టేషన్ పరిధిలోని ఖాళీ స్థలాన్ని 15 ఏళ్ల లీజుకు అందించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాపట్ల జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి వైవీకే రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు చీరాలలో నిర్వహిస్తున్నట్లు డీఎం జె.శ్యామల తెలిపారు. సమావేశానికి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు హాజరు కావాలన్నారు. వివరాలకు 99592 25697, 99592 25425 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిర్వాసితులకు పట్టాలు పంపిణీ



పట్టాలు అందిస్తున్న గృహనిర్మాణశాఖ అధికారి

అద్దంకి రూరల్: నిర్వాసితులకు అధికారులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పదేళ్ల క్రితం గృహ నిర్మాణాలకు రుణం పొందేందుకు ముంపు గ్రామం ధేనువుకొండ నిర్వాసితులు గృహనిర్మాణ శాఖకు తమ ఇంటి పట్టాలు అందజేశారు. తరువాత వేలమూరిపాడు, బలరామకృష్ణపురం నిర్వాసితుల్లో కొంత మందికి ఇందిరమ్మ ఇళ్లకింద రుణం మంజూరయ్యాయి. రుణాలు మంజూరు కాని వారి పట్టాలు కూడా గృహనిర్మాణ శాఖలోనే ఉన్నాయి. ఇటీవల తమ ఒరిజినల్ పట్టాలను తమకు ఇవ్వాలని గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను గృహ రుణాలు రాని నిర్వాసితులు కోరారు. స్పందించిన ఇంజినీర్ శుక్రవారం గృహనిర్మాణ శాఖ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ తిరుపతయ్య ద్వారా కాలనీలోని 85 మందికి పట్టాలు అందిచారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ రామిరెడ్డి ఆదిరెడ్డి, మాదాల శ్రీకాంత్ బత్తిన అనుబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.